మైక్రో బ్రూవరీస్ ఏర్పాటుకు రెండు దరఖాస్తులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మైక్రోబ్రూవరీస్ ఏర్పాటుకు రెండు దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఈఎస్) పి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం గడువు ముగిసిందన్నారు. ఒక్కో మైక్రో బ్రూవరీ ఏర్పాటుకు కోటిన్నర నుంచి రెండు కోట్ల పెట్టుబడి అవసరమవుతుంది. ఈ మైక్రో బ్రూవరీల్లో బీరు మాత్రమే విక్రయించాల్సి ఉంటుంది. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎవరూ దరఖాస్తు చేసుకోలేదని తెలిసింది.

గొప్ప మానవతావాది

పండిట్ దీన్‌దయాల్



ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతిత): అంత్యోదయ సిద్ధాంత కర్త గొప్ప మానవతా వాది పండిట్ దీన్‌దయాల్ అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్నం లేకుండా ఎవరు అలమటించ వద్దని అంత్యోదయ సిద్ధాంతాన్ని తీసుకు వచ్చిన మహనీయుడన్నారు. సేవే లక్ష్యంగా రాజకీయాలు కొనసాగించాలని చెప్పిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్‌రావు, బాస సత్యనారాయణరావు, గుగ్గిళ్లపు రమేష్, వాసాల రమేష్, పాల్గొన్నారు.

● నగరంలోని రేకుర్తి 18వ డివిజన్‌లో బీజేపీ పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పండిట్ దీన్‌దయాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాంపల్లి శంకర్, ఎం లక్ష్మీ రాజం, లాలమురళి, అస్తపురం విక్రమ్, సంజీవరెడ్డి, రావుల భాస్కరాచారి,రాజేష్, పోచయ్య పాల్గొన్నారు.

● పండిట్ దీన్‌దయాల్ జయంతి సందర్భంగా విద్యానగర్‌లో బీజేపీ నాయకులు శక్తి కేంద్రం ఇన్‌చార్జి నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వ ర్యంలో చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రమేష్‌చంద్ర, బండ రాకేష్, చంద్రగిరి వేణు, మొగిలి లక్ష్మణ్, పోతు జగదీష్, కచ్చు మధు, బొంగుని పరుశురాం, భగత్ పాల్గొన్నారు.

ఇక మద్యం దుకాణాల జాతర

● అక్టోబరు 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
● వైన్స్ దరఖాస్తు ఫీజు రూ. మూడు లక్షలకు పెంపు
● అక్టోబరు 23న లాటరీ ద్వారా లైసెన్సీల ఎంపిక
● ఎస్సీలకు 9, గౌడ కులస్థులకు 17 షాపులు



కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల లైసెన్స్‌లు నవంబరు 30వ తేదీ వరకు గడువు ఉంది. అక్టోబరులో స్థానిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ రానుండడంతో రెండు నెలల ముందుగానే మద్యం షాపుల వేలం ప్రక్రియను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మద్యం పాలసీని ప్రకటిస్తూ జీవో జారీ చేసింది. గతంలో ఉన్న దరఖాస్తు ఫీజును (నాన్ రిఫండబుల్) రెండు లక్షల నుంచి మూడు లక్షలకు పెంచింది. మిగతా విషయాల్లో పాత పాలసీనే అనుసరించింది. జనాభా ప్రాతిపదికన లైసెన్సు ఫీజును వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2025 డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30వ తేదీ వరకు నూతన మద్యం విధానం అమల్లోకి వస్తుంది.

● లాటరీ ద్వారా ఎంపిక

గతంలో మాదిరిగానే లాటరీ ద్వారా వైన్‌షాపుల లైసెన్స్‌దారులను ఎంపికచేయనున్నారు. మద్యం షాపు లైసెన్స్ కోసం ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఎక్సైజ్ టాక్స్‌ను గతంలో మాదిరిగా ఆరు విడతల్లో చెల్లించేందుకు వీలు కల్పించారు. కొత్త పాలసీ ప్రకారం మద్యం రిటైల్ షాపులన్నీ విధిగా మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కెమెరాలను ఎక్సైజ్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేస్తారని పాలసీలో పేర్కొన్నారు. వైన్స్ వద్ద విధిగా పార్కింగ్ స్థలాలను కూడా లైసెన్సుదారులే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

● నేడు నోటిఫికేషన్

జిల్లాలోని 94 వైన్‌షాపుల వేలం ద్వారా లైసెన్స్ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శుక్రవారం కలెక్టర్ జారీ చేయనున్నారు. అదే రోజు (26వ తేదీ) నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై అక్టోబరు 18వ తేదీ సాయంత్రం వరకు చివరి గడువుగా నిర్ణయించారు. 23వ తేదిన లాటరీ ద్వారా లైసెన్సీలను ఎంపిక చేయనున్నారు. వైన్‌షాపుల లైసెన్స్‌కు ఎంపికైన వారికి 23న లైసెన్స్ ఫీజు మొదటి వాయిదా చెల్లించాల్సి ఉంటుంది. నవంబరు 30న కొత్త వైన్‌షాపులకు మద్యం స్టాక్‌ను జారీ చేస్తారు. డిసెంబరు 1వ తేదీ నుంచి కొత్త లైసెన్స్‌దారులు మద్యం అమ్మకాలను ప్రారంభిస్తారు.

● జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజు

జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజులు ఖరారు చేశారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఐదు వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాలకు ఏడాదికి 50 లక్షల లైసెన్స్ ఫీజు నిర్ణయించారు. 5001 జనాభా నుంచి 50 వేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ. 55 లక్షలు, 50,001 జనాభా నుంచి లక్ష జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ. 60 లక్షల ఫీజును ఖరారు చేశారు. 1,00,001 జనాభా నుంచి ఐదు లక్షల లోపు ఉన్న ప్రాంతాలకు రూ. 65 లక్షలు, 5,00,001 జనాభా నుంచి 20,00,000 జనాభా ఉన్న ప్రాంతాలకు 85 లక్షలు, 20 లక్షలపైగా జనాభా ఉన్న ప్రాంతాలకు

(మిగతా 8వ పేజీలో)

● వైన్‌షాపులకు రిజర్వేషన్లు ఖరారు....

జిల్లాలోని 94 వైన్‌షాపులకు కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ సమక్షంలో రిజర్వేషన్లను ఖరారు చేశారు. వైన్‌షాపుల లైసెన్స్‌ల కేటాయింపులో గౌడ కులస్థుల, ఎస్సీల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఈ మేరకు బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, ఎస్‌సీ వెల్ఫేర్ ఆఫీసర్, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ సమక్షంలో గురువారం కలెక్టరేట్‌లో వైన్‌షాపుల రిజర్వేషన్‌లను లాటరీ ద్వారా ఖరారు చేశారు. మద్యం షాపుల లైసెన్స్‌లలో గౌడ కులస్థులకు 15 శాతం, ఎస్సీలకు 10, ఎస్టీలకు ఐదు శాతం రిజన్వేస్వేషన్లను అమలు చేస్తున్నారు. మిగతా 70 శాతం షాపులు ఓపెన్ కేటగిరీలో ఉంటాయి. జిల్లాలో మొత్తం 94 షాపులుండగా డ్రా ద్వారా ఎస్సీలకు -9, గౌడ కులస్థులకు-17 మొత్తం 26 షాపులకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఈ 26 వైన్‌షాపులకు రిజర్వేషన్ ఉన్న కేటగిరీ వారే లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మిగతా 68 వైన్‌షాపులకు అన్ని కేటగిరీలకు (ఓపెన్) చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీలకు 1, 13, 14, 17, 32, 56, 57, 76, 89 గెజిట్ షాపులు, గౌడ కులస్థులకు 2, 15, 19, 24, 26, 31, 43, 50, 52, 55, 63, 65, 71, 72, 78, 79, 91 షాపులు రిజర్వు అయినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు తెలిపారు.





ఎడతెగని ముసురు..

జిల్లాలో గురువారం తెల్లవారు జామునుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురిసింది. జిల్లాలో బుధవారం ఉదయం 8.30 నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు 5.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జమ్మికుంట మండలం కొత్తపల్లి - ధర్మారంలో 34.3, హుజూరాబాద్ మండలం బోర్నపల్లిలో 32.3, మానకొండూర్ మండలం ఈదులగట్టెపల్లిలో 31 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, కరీంనగర్



కనికరించు.. కాత్యాయని

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో గురువారం దుర్గామాత కాత్యాయని రూపంలో దర్శనమి చ్చింది. భక్తులు, భవానీ దీక్షాపరులు అమ్మవారిని దర్శించుకున్నారు. చైతన్యపురి మహాశక్తి ఆలయంలో ఉదయం కాత్యాయనిదేవి (కూష్మాండ) పూజ, పండ్లతో అలంకరణ, సాయంత్రం పుష్పాభిషేకం చేశారు. మహేశ్వ రశర్మ అమ్మవారి విశిష్టతను వివరించారు. రాత్రి దాండియా నృత్యం కొనసాగింది. ఆలయ నిర్వాహకుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలసి పూజలు నిర్వహించారు. యజ్ఞవరాహస్వామిక్షేత్రంలో వరదుర్గ అమ్మవారికి అభి షేకం, చతుష్షష్ఠి పూజలు, కుంకుమార్చనలు జరిగాయి. అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరంలో విష్ణుసేవానందగిరిస్వామి పూజలు, ప్రవచనం చేశారు. కాత్యాయనీ మాత రూపంలో ఉన్న అమ్మవారికి శాకంబరి అలంకరణ చేశారు. విద్యానగర్ విజయదుర్గ కాలనీలో పార్థివ మహాలింగార్చన నిర్వహించారు.



మహాశక్తి ఆలయంలో అమ్మవారికి పండ్లతో అలంకరణ

● గరుడ వాహనంపై దుర్గా భవానీ

కరీంనగర్ రూరల్: కరంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గా భవానీ ఆలయంలో శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారు వైష్ణవి అలంకరణలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రదానార్చకులు పవన కృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చి పూజలు నిర్వహించారు.



పాతబజార్ గౌరీశంకరాలయంలో అమ్మవారికి కాత్యాయని అలంకారం



వైష్ణవి అలంకరణలో అమ్మవారు

బయోగ్యాస్ ప్లాంట్, కొత్త డీఆర్‌సీసీలు ఏర్పాటు చేయండి

● మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బయోగ్యాస్ ప్లాంట్, కొత్త డీఆర్‌సీసీలు, వర్మీకంపోస్టు పిట్స్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ సానిటేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ సమావేశ మందిరంలో ఆయన పారిశుధ్య విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య వాహనాల పార్కింగ్ కోసం పరిశీలన చేసిన స్థలంలో నూతన వెహికిల్ షెడ్డు నిర్మించేందుకు టెండర్ నిర్వహించి పనులు త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు.

పారిశుధ్య వాహనాలకు జీపీఎస్ ట్రాక్ సిస్టమ్‌ను అమర్చాలని అన్నారు. పారి శుధ్య పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున ఎక్కడ కూడా వర్షపు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఫుట్‌పాత్ హోల్స్‌లో చెత్త పేరుకు పోకుండా చర్యలు తీసుకొని వర్షపు నీరు రోడ్లపై నిలువకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు వేణుమాధవ్, ఖాదర్ మొహియుద్దీన్, అసిస్టెంట్ కమిషనర్ దిలీప్ కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్లు స్వామి, రమేశ్ పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవ' నిరంతరం కొనసాగాలి

● కాలుష్యాన్ని తగ్గిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి
● మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిరంతరం కొనసాగాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసుకొని కాలుష్యాన్ని తగ్గించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గురువారం స్వచ్ఛతా హీ సేవ 2025 కార్యక్రమంలో భాగంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ అనే నినాదంతో మానేరు డ్యాం పరివాహక ప్రాంతంలో శ్రమదానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నివారణ, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కరీంనగర్ పరిసరాల్లో మానేరు డ్యాం, ఎలగందుల ఖిల్లా లాంటి టూరిజం హబ్‌లు ఉన్నాయని, వీటిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ఏక్ దిన్ .. ఏక్ గంట.. ఏక్ సాత్ నినాదంతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగర వ్యాప్తంగా స్వచ్ఛతా కార్యక్రమాలు చేపడుతూ నగరాన్ని స్వచ్ఛ నగరంగా మార్చేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాఖడే, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్ నాయకులు వెలిచాల రాజేందర్‌రావు, వైద్యుల అంజన్ కుమార్, ఆకుల నర్సయ్య, డిప్యూటీ కమిషనర్లు వేణు మాధవ్, ఖాదర్, అసిస్టెంట్ కమిషనర్ సందీప్ కుమార్ పాల్గొన్నారు.



స్వచ్ఛతా హీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ పమేలాసత్పతి, కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యను అందించాలి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ● ప్రజాపాలనలో ఎన్నో మార్పులు వచ్చాయి
● మంత్రి పొన్నం ప్రభాకర్
● 'శాతవాహన'లో వసతి గృహాలకు శంకుస్థాపన

7



వసతి గృహాలకు భూమి పూజ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

● నేర సమీక్షా సమావేశంలో సీపీ గౌస్ ఆలం



పోలీస్ కమిషనరేట్ లోగోను ఆవిష్కరిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. గురువారం కమిషనరేట్ కేంద్రంలో పోలీస్ కమిషనర్ పోలీసు అధికారులతో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పిటిషన్ మేనేజ్‌మెంట్‌ను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు ఆయా సర్కిల్ పరిధిలోని పోలీసు స్టేషన్లను తరచూ సందర్శించి సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలన్నారు. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన పెంచాలని ఆదేశించారు. స్టేషన్‌లను ఎస్‌హెచ్‌వోలు పరిశుభ్రంగా ఉంచి, రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ట్రాఫిక్, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలన్నారు. ప్రజలకు మరింత చేరువగా పోలీసు సేవలను అందించేందుకు డివిజన్‌ను సెక్టార్లు, సబ్‌సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కు ఇన్‌చార్జిలను నియమించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు వెంకట రమణ, భీంరావు పాల్గొన్నారు.

● కమిషనరేట్ నూతన లోగో ఆవిష్కరణ

పోలీస్ కమిషనరేట్‌కు ప్రత్యేకంగా రూపొం దించిన నూతన లోగోను సీపీ గురువారం అధికారికంగా ఆవిష్కరించారు. ఈ లోగోను ఇకపై రాష్ట్ర పోలీసు లోగోతోపాటు పోలీసులు యూని ఫాంపై ధరించవచ్చని సీపీ తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచ కొండ సొంత లోగో కలిగిన నాలుగో పోలీస్ కమిషనరేట్‌గా కరీంనగర్ నిలిచిందన్నారు.

టీబీ రహిత గ్రామాల కోసం సహకరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): టీబీ రహిత గ్రామాల కోసం అందరూ సహకరించాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో టీబీ చాంపియన్స్ శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ క్షయతో బాధపడే వారు జాగ్రత్తలు వహిస్తే ఇతరులకు వ్యాధి సంక్రమించకుండా ఉంటుందన్నారు. ప్రభుత్వం క్షయ వ్యాధికి ఉచిత వైద్యం అందిస్తుందని, లక్షణాలు ఉన్న వారు అశ్రద్ధ వహించకుడా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ మేనేజర్ సురేందర్ మాట్లాడుతూ అందరూ టీబీ వ్యాధిపైన అవగాహన కలిగి ఉండాలని, మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. వ్యాధి నివారణలో అందరూ భాగస్వాములు కావడం ద్వారా దేశంలో టీబీ వ్యాధిని అంతమొందించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇంపాక్ట్ ప్రాజెక్టు సిబ్బంది వనిత, పారిజాతం, శ్రీను, రాజుబోస్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

● రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి డ్రైవర్ పోస్టులు
● 743 శ్రామిక్ పోస్టులు

6

అధ్వానంగా వ్యవసాయ మార్కెట్ రోడ్డు

● గుంతలు పడి... ప్రమాదకరంగా మారి
● పట్టించుకోని అధికారులు

7

వాహనం ఢీకొని యువకుడి మృతి

రామడుగు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):రామడుగు మండలం కొరటపల్లి గ్రామంలో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొనగా యువకుడు దుర్మరణం చెందిన సంఘటన గ్రామంలో కలకలం రేపింది. రామడుగు ఎస్‌ఐ కె రాజు కథనం ప్రకారం కొరటపల్లి గ్రామానికి చెందిన మేకల శ్రీధర్(27) తన బజాజ్ ప్లాటినంపై రామడుగు నుంచి కొరటపల్లి వెళ్తుండగా షానగర్ కల్వర్టు వద్ద గుర్తుతెలియని, అజాగ్రత్తగా, అతివేగంగా వస్తున్న కోళ్ల వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీధర్ ఎగిరి కిందపడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడి తండ్రి మేకల సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సీతారాంపూర్ వద్ద మరొకరు..

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం సీతారాంపూర్ గ్రామశివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చొప్పదండికి చెందిన కొంకటి సందీప్(24) మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. సందీప్ కరీంనగర్‌లోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ గురువారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై కరీంనగర్‌కు వస్తున్నాడు. కేఆర్ గార్డెన్ వద్ద ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు సందీప్ బైక్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తలకు, ముఖంకు తీవ్రగాయాలైన సందీప్‌ను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు, మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీలో పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి డ్రైవర్ పోస్టులు
- 743 శ్రామిక్ పోస్టులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పోస్టుల భర్తీకి సంస్థ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా పలు పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డ్రైవర్ పోస్టులు వెయ్యి ఉండగా, శ్రామిక్ పోస్టులు 743 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారు. కరీంనగర్, పెద్దపల్లి, జగి



త్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్, ములుగు జిల్లాలను డిస్ట్రిక్ట్ కేడర్-2గా నిర్ణయించి 48 డ్రైవర్ పోస్టులను నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. ఇందులో లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ (బ్యాక్‌లాగ్)లో ఏడు పోస్టులు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో 41 పోస్టులను భర్తీ చేయనున్నారు. శ్రామిక్ పోస్టులుగా మెకానికల్ డీజిల్/మెకానికల్ మోటార్ వెహికల్ పోస్టులు 29 భర్తీ చేయనున్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

తెలంగాణ రాష్ట్రంలో భర్తీ చేయనున్న పోస్టులకు గాను అక్టోబరు 8వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. www.tgprb.in వెబ్‌సైట్‌లో అక్టోబరు 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తులు సమర్పించేందుకు నిరుద్యోగులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

డిస్ట్రిక్ట్ కేడర్-2లో డ్రైవర్ పోస్టులు

	ఎల్ఆర్	డీఆర్	మొత్తం
కరీంనగర్	2	10	12
పెద్దపల్లి	1	9	10
జగిత్యాల	2	9	11
రాజన్న సిరిసిల్ల	1	6	7
జయశంకర్	1	4	5
ములుగు	0	3	3
	7	41	48

డిస్ట్రిక్ట్ కేడర్-2లో శ్రామిక్ పోస్టులు

	ఎల్ఆర్	డీఆర్	మొత్తం
కరీంనగర్	0	7	7
పెద్దపల్లి	0	6	6
జగిత్యాల	0	7	7
రాజన్న సిరిసిల్ల	0	4	4
జయశంకర్	0	3	3
ములుగు	0	2	2
	0	29	29

ఎల్ఆర్ (లిమిటెడ్ రిక్రూట్‌మెంట్), డీఆర్ (డైరెక్ట్ రిక్రూట్‌మెంట్)

రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్ పోస్టులు వెయ్యి, శ్రామిక్‌లుగా 743 పోస్టులను భర్తీ చేయనున్నారు. డ్రైవర్లకు పే స్కేల్ 20,960-60,080, శ్రామిక్ పోస్టులకు 16,550-45,030 నిర్ణయించారు.

వేములవాడలో ఇంట్లోకి కొండచిలువ



వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌లో కొండచిలువ



విద్యుత్తు స్టార్టర్ బాక్స్‌లోని ఫ్యూజ్‌లో ఉన్న కట్ల పాము

వేములవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణం గాంధీనగర్‌లోని ఓ ఇంట్లో గురువారం ఉదయం భారీ కొండచిలువ ప్రత్యక్షమైంది. అంజయ్య అనే వ్యక్తి ఇంట్లో కొండచిలువ కనిపించడంతో కుటుంబ సభ్యులు భయాందోళన గురయ్యారు. కాలనీవాసులు అక్కడకు చేరుకొని సుమారు ఆరడుగుల కొండచిలువను చంపి వేశారు. మూలవాగులో నీటి ప్రవాహం పెరుగుతుండడంతో పాటు, మిడ్‌మానేరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ చేరుకున్న కారణంగా పరిసర ప్రాంతాల్లోని ఇండ్లలోకి తరచూ పాములు వస్తున్నట్లు ఇక్కడి ప్రజలు తెలిపారు.

విద్యుత్ స్టార్టర్ బాక్స్‌లో పాము

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని రైతు మొడుసు బాపురెడ్డి తన వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్తు స్టార్టర్ డబ్బాలో గురువారం కట్ల పాము ప్రత్యక్షమైంది. వ్యవసాయ బోరు మోటారును ఆఫ్ చేసేందుకు ఓ ఫ్యూజ్ తీయడంతో అందులో కట్లపాము చుట్టుకుని కనిపించింది. భయాందోళనకు గురైన రైతు బాపురెడ్డి కర్ర తీసుకుని చంపేందుకు ప్రయత్నించగా తప్పించుకుపోయిందని పేర్కొన్నాడు.

జగిత్యాలలో ఒకరి హత్య

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ శివారులోని ఓ దాబాలో బుధవారం అర్ధరాత్రి జగిత్యాల మండలం మోరపల్లి గ్రామానికి చెందిన వంగ శ్రీనివాస్(43) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని నిజామాబాద్ రోడ్డులో గల ఓ బార్‌లో పట్టణంలోని చింతకుంటవాడకు చెందిన చరణ్‌జీత్ సింగ్, దాసరి సుమన్ అనే ఇద్దరి మధ్య బుధవారం అర్ధరాత్రి గొడవ జరిగింది. ఈ క్రమంలో జగిత్యాల మండలం మోరపల్లి గ్రామానికి చెందిన వంగ శ్రీనివాస్ ఆపడానికి వెళ్లగా చరణ్‌జీత్ సింగ్ బీరు సీసాతో తలపై కొట్టాడు. దీంతో శ్రీనివాస్ కిందపడగా చరణ్‌జీత్ సింగ్ అతడిపై దాడిచేయగా తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాస్‌ను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు శ్రీనివాస్ భార్య వంగ సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చరణ్‌జీత్ సింగ్ పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వీధుల్లో గుంపులుగా శునకాలు

- భయాందోళనలో ప్రజలు



పెగడపల్లిలో ప్రధాన రహదారిపై శునకాలు

పెగడపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువైంది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో అంబేద్కర్ కూడలి నుండి గాయత్రి బ్యాంక్ వరకు డబుల్ రోడ్డులో కుక్కలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఎక్కడ చూసినా పది నుంచి 20 వరకు గుంపులుగా ఉంటూ ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి వెంట పడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వం పట్టించుకుని తమకు కుక్కల బెడద నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మల్యాల: గ్రామాల్లో శునకాల బెడద నానాటికి పెరుగుతోంది. శునకాల సమూహంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మల్యాల మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామంలో శునకాల దాడిలో అనేక మంది గాయాల పాలు అవుతున్నారు. అధికారులు శునకాలను తరలించే చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.



మల్యాలలో శునకాల గుంపు

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

ఇల్లంతకుంట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన ఎద్దు నర్సయ్యకు చెందిన రెండు గొర్రెలు విద్యుదాఘాతంతో గురువారం మృతి చెందాయి. రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభం సపోర్టు వైరుకు గొర్రెలు తగలడంతో దాదాపు రూ.24వేల విలువైన రెండు గొర్రెలు మృతిచెందాయి. సమాచారం అందుకున్న సెస్‌సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సెస్‌సంస్థ ఆదుకోవాలని బాధితుడు కోరారు.

'కడారి'కి కన్నీటి వీడ్కోలు..

- గోపాల్‌రావుపల్లిలో అంత్యక్రియలు పూర్తి
- నివాళులర్పించిన ప్రజాసంఘాల నాయకులు



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చిన్ననాటి మిత్రుడు టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవిప్రసాద్ తదితరులు



గోపాల్‌రావుపల్లిలో కడారి సత్యనారాయణరెడ్డి అంతిమయాత్ర

తంగళ్లపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో ఈ నెల 22న ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు కోసా అలియాస్ కడారి సత్యనారాయణరెడ్డికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు గురువారం కన్నీటి వీడ్కోలు పలికారు. కోసా అంత్యక్రియలు రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావ్‌పల్లిలో పూర్తయ్యాయి. గురువారం కడారి సత్యనారయణరెడ్డి మృతదేహం స్వగ్రామానికి చేరుకోగానే బంధువులు, స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. సందర్శకుల కోసం ఆయన ఇంటి ఆవరణలో మృతదేహాన్ని ఉంచారు. వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు, కళాకారులు ఘనంగా నివాళులర్పించారు. బంధుమిత్రులు నివాళులర్పించి కడారితో అనుబంధాన్ని, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎర్ర జెండాలతో, విప్లవ గీతాలతో కడారి అంతిమయాత్ర సుమారు మూడు గంటల పాటు కొనసాగింది. ఈ సందర్భంగా భారత్ బచావో జాతీయ అధ్యక్షుడు గాదె ఇన్నయ్యతో పాటు పౌర సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎన్‌కౌంటర్లను కేంద్ర ప్రభుత్వం చేసిన హత్యలుగా అభివర్ణించారు. కడారితో పాటు రాజును బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారని ఆరోపించారు. విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాణి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరావ్, టీఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు దేవిప్రసాద్, అమరుల బంధు మిత్రుల కమిటీ రాష్ట్ర కార్యదర్శి పద్మకుమారి, సహాయకార్యదర్శి భవాని, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, వివిధ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరునెలల వ్యవధిలో దంపతులిద్దరూ..

ఉద్యమబాట పట్టిన కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా, ఆయన భార్య రుక్కు అలియాస్ రాధలు ఆరు నెలల వ్యవధిలో అమరులయ్యారు. ఉద్యమబాట పట్టిన కడారి సత్యనారాయణరెడ్డి మావోయిస్టు పార్టీలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న రుక్కు అలియాస్ రాధను వివాహం చేసుకున్నాడు. తీవ్ర అనారోగ్యానికి గురైన రాధ ఈ ఏడాది మార్చి 29న మరణించిందని అంత్యక్రియల్లో పాల్గొన్న విప్లవ సంఘాల నేతలు తెలిపారు.

చిన్నప్పుడు చీకటి అంటే భయపడేవాడు

- కడారి కరుణాకర్‌రెడ్డి, సోదరుడు



చిన్నప్పుడు సత్యనారాయరెడ్డి చీకటి అంటే భయపడేవాడు. పదో తరగతి చదివే టప్పుడు రాత్రిపూట బయటకి వెళ్లాలంటే తోడు లేనిది వెళ్లేవాడు కాదు. అలాంటిది మావోయిస్టు పార్టీలోకి వెళ్లాడంటే నమ్మలేకపోయాం. 1980లో ఉగాది పండుగకు ఇంటికి వచ్చి ఒకరోజు గడిపాడు. అప్పుడు గ్రామం నుంచి వెళ్లి 45 సంవత్సరాల తర్వాత శవమై వచ్చాడు.

విప్లవ ఉద్యమానికి శత్రువులు భయపడుతున్నారు

పాణి, విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



విప్లవ ఉద్యమానికి శత్రువులు భయపడుతున్నారు. భౌతికంగా వ్యక్తులు లేకపోవచ్చు కానీ మావోయిజం సజీవంగా ఉంటుంది. కార్పొరేట్ సంస్థలకు ఖనిజ సంపదను ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను హత్య చేస్తోంది. దానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న కోసాను హత్య చేసింది.

నాయకత్వ లక్షణాలు ఉండేవి

- ఠాకూర్ కరణ్‌లాల్, మిత్రుడు



కడారి సత్యనారాయణరెడ్డిలో నాయకత్వ లక్షణాలు ఉండేవి. పెద్దపల్లిలో కడారి 1976-78 సంవత్సరంలో ఐటీఐ చదివాడు. అప్పుడు స్నేహం ఏర్పడింది. కడారిలో స్నేహం, మంచితనం, ఉద్యమస్ఫూర్తి ఉండేవి.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటకు చెందిన మచ్చ భూమక్క(62) ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న భూమక్క జీవితంపై విరక్తితో బుధవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా గురువారం ఉదయం మృతి చెందింది. భూమక్క కుమారుడు కుమారస్వామి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్‌లో ఈ నెల 9న రాకేష్ అనే వ్యక్తి తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా కరీంనగర్ రూరల్ పోలీసులు ఆ ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆదిలాబాద్‌లో ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ ఫోన్‌ను గురువారం బాధితుడికి సీఐ నిరంజన్‌రెడ్డి ద్వారా అందజేశారు.

గీత కార్మికుడికి గాయాలు

రామగిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లద్నాపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల శంకర్‌గౌడ్ గురువారం ఈత చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయం ఈత చెట్టు నుంచి కల్లు దించే క్రమంలో చెట్టుకు వేసుకున్న నిచ్చెన జారీ పోవడంతో చెట్టుపై నుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో నడుముకు గాయాలు కాగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ఇంటిలో గ్యాస్ లీక్.. తప్పిన ప్రమాదం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మేర్గవేణ ప్రశాంత్ ఇంటిలో పండుగ సందర్భంగా గురువారం పిండి వంటలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. దీంతో గ్యాస్ పొయ్యి పక్కన ఉన్న సామగ్రికి మంటలు అంటుకొని కాలిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గమనించిన చుట్టు పక్కల వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. దీంతో పెద్దప్రమాదం తప్పిందని కుటుంబ సభ్యులతో పాటు చుట్టు పక్కల వారు ఊపిరి పీల్చుకున్నారు.

పెద్దమ్మ గుడిలో చోరీ

శంకరపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం పెద్దమ్మ గుడిలో దుండగులు చోరీకి పాల్పడి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. కేశవపట్నం గ్రామంలోని ముదిరాజ్ సామాజిక వర్గం వారు పెద్దమ్మ గుడిలో వారానికి ఒకరు చొప్పున ఆలయ పరిసరాలు శుభ్రపరిచి పూజా కార్యక్రమాలు చేస్తుంటారు. అందులో భాగంగా గురువారం ఉదయం వారు వెళ్లి చూడగా సుమారు లక్ష రూపాయలు విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు తెలిపారు. ఈ మేరకు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రవి చోరీ విషయంపై పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

మహిళకు లైంగిక వేధింపులు

నిందితుడికి ఐదు సంవత్సరాల జైలు

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళను లైంగిక వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన రాజన్న సిరిసిల్ల జిల్లా జోగాపూర్ గ్రామానికి చెందిన నిందితుడు మొహమ్మద్ రహీం(38)కు ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ మెట్‌పల్లి కోర్టు సీనియర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నాగేశ్వర్‌రావు గురువారం తీర్పు వెలువరించారని ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఓ మహిళను మొహమ్మద్ రహీం తరచూ వెంబడిస్తూ లైంగికంగా వేధించాడు. ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడాడు. దీంతో బాధిత మహిళ 2018 ఫిబ్రవరిలో మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయినా నిందితుడి ప్రవర్తనలో మార్పు రాలేదు. బాధితురాలిని, ఆమె భర్తను, కుటుంబ సభ్యులను ఫోన్‌లో వేధించడంతో బాధిత మహిళ అవమానం తట్టుకోలేక 25 మార్చి 2018లో ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుడిపై మరొక కేసు నమోదు చేశారు. దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం సాక్ష్యాలు, వాంగ్మూలాలు సమీక్షించిన న్యాయమూర్తి నాగేశ్వర్‌రావు నిందితుడు మొహమ్మద్ రహీంకు ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన పీపీ ఆనంద్ గౌడ్, అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎస్ఐ శంకర్‌రావు, సీఎంఎస్ ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ వినోద్‌లను ఎస్పీ అభినందించారు.

విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన వ్యాను

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహం సమీపంలో గల విద్యుత్తు స్తంభాన్ని గురువారం రాత్రి ఓ వ్యాను అతివేగంగా ఢీకొట్టింది. ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో పాటు కరెంటు స్తంభం, తీగలు తెగిపోయి వాహనంపై పడ్డాయి. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం వల్ల ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న 'సెస్' సిబ్బంది మరమ్మతు పనులను చేపట్టారు. సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

అవయవదానం.. ఆరుగురికి ప్రాణదానం

- కన్నాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి బ్రెయిన్‌డెడ్
- అవయవదానానికి ఒప్పుకున్న కుటుంబీకులు



రాజేష్‌కుమార్ (ఫైల్)

శంకరపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాను మరణించినా అవయవదానం ద్వారా ఆరుగురికి జీవించే అవకాశం కలిగించాడు.

అవయవదానంతో కొన్ని కుటుంబాల్లో కొత్త వెలుగులు నిండుతాయి. మరణించినా జీవించి ఉండడమే అవయవదానం గొప్పతనమని అతని భార్య, తల్లిదండ్రులు ఆలోచించి పుట్టెడు దుఃఖంలోనూ ఆరుగురి జీవితాల్లో వెలుగు నింపడానికి అవయవదానానికి ముందుకు వచ్చారు. వివరాల్లోకి వెళ్లితే.. శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన చిలువేరి రాజేష్‌కుమార్ (38) ఉద్యోగ రీత్యా కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 20న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో తలకు తీవ్రమైన గాయాలు కావడంతో హైద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్‌తో బుధవారం రాత్రి మృతి చెందాడు. అతని భార్య సుస్మిత, తల్లిదండ్రులు చిలువేరి ఆగయ్య-వజ్రమ్మ పుట్టెడు దుఃఖంలో అవయవదానానికి ఒప్పుకున్నారు. అవయవాలను జీవన్‌ధాన్ సంస్థకు అప్పగించారు. తాను మరణించినా మరో నాలుగు కుటుంబాల్లో వెలుగు నింపడానికి అవయవదానానికి ముందుకు రావడంపై గ్రామస్థులు కుటుంబాన్ని అభినందిస్తున్నారు. మృతుడు రాజేష్‌కుమార్‌కు తల్లిదండ్రులు, ఇద్దరు కూతుళ్లు, భార్య స్వప్న ఉన్నారు. గురువారం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీటి మధ్య కన్నాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

బలహీనవర్గాలకు అండగా కాంగ్రెస్

- మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఆదివాసీ శిక్షణ తరగతులు ప్రారంభం



ఆదివాసీ గిరిజనుల శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సామాజిక న్యాయానికి ఛాంపియన్‌గా ఉందని, ఆదివాసీలు, గిరిజనులు, బలహీన వర్గాలకు పార్టీ అండగా నిలుస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర గిరిజన, మైనార్టీ, సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి కాంగ్రెస్ ఆదివాసీలకు రాష్ట్ర ఆదివాసీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతులను డీసీసీ కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. మొదట డీసీసీ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం వేదికపై సేవలాల్ మహారాజ్, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల శిక్షణ తరగతులను మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి, బలహీన వర్గాలకు సంబంధించిన అంశాలు చర్చించాలన్నారు. కాంగ్రెస్ సామాజిక న్యాయానికి ఛాంపియన్ అని, పార్టీలో మాత్రమే సామాజిక న్యాయం ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమే బలహీన వర్గాల అభివృద్ధి జరిగిందని అన్నారు. విద్య భవిష్యత్ సమాజానికి పునాదులు వేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. నాడు ఈ దేశంలో ఆదివాసీలకు, గిరిజనులకు, బలహీన వర్గాలకు అండగా ఉన్నది ఇందిరాగాంధీ, కాంగ్రెస్ పార్టీయే అన్నారు. నాటి నుంచి సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క గిరిజనులకు అండగా ఉన్నారన్నారు. మొదటిసారి రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్ అడ్వయిజర్ కమిటీ బోర్డు మీటింగ్ ఏర్పాటు చేసిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఆదివాసీలను పట్టించుకోలేదని, మన రాష్ట్ర ప్రభుత్వం సుమారు 740 కోట్ల రూపాయలతో ఆదివాసీలు నివసించే ప్రాంతాలలో మౌలిక వసతులు కల్పనకు నిధులు వెచ్చించిందని తెలిపారు. రాష్ట్ర ఆదివాసీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బెల్లయ్యనాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో దేశంలోని 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలని ఏఐసీసీ నిర్ణయం తీసుకుందన్నారు. దేశవ్యాప్తంగా 25 వేల మంది కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దాలని నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రంలోని 7 ఉమ్మడి జిల్లాల్లో ట్రైబల్స్‌కు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్టీ సెల్ సమన్వయకర్త కోట్యానాయక్, కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, జిల్లా కాంగ్రెస్ ఆదివాసీ సెల్ చైర్మన్ బానోతు శ్రవణ్‌నాయక్, జిల్లా ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, మాజీ హౌస్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పాల్గొన్నారు.

చేనేతపై జీఎస్టీని ఎత్తివేయాలి

● రాష్ట్రపతికి ఎమ్మెల్సీ ఎల్ రమణ లేఖ



జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగంపై విధించిన జీఎస్టీని వెంటనే ఎత్తివేయాలని కోరుతూ ఎమ్మెల్సీ ఎల్ రమణ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు గురువారం లేఖ రాశారు. లేఖలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను అందులో వివరించారు. 2017లో ముడి సరుకులపై విధించిన జీఎస్టీ ఐదు శాతం, ఇప్పుడు చేనే త ఉత్పత్తులపై విధించిన జీఎస్టీ 18శాతంతో లక్షలాది చేనేత కుటుంబాల జీవనోపాధి దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులు, ముడి సరుకులపై జీరో జీఎస్టీని అమలు చేయాలని, చేనేతకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునేటప్పుడు కార్మికులను భాగస్వామ్యం చేయాలని, హ్యాండ్లూమ్ బోర్డును పునరుద్ధరించాలని రమణ రాష్ట్రపతిని అభ్యర్థించారు. రాష్ట్రపతి తక్షణమే జోక్యం చేసుకుని వేలాది చేనేత కుటుంబాలను రక్షించాలని రమణ రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు.

ముగిసిన కబడ్డీ క్రీడా శిక్షణ శిబిరం



జిల్లా బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా నిర్వహిస్తున్న కబడ్డీ క్రీడా శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్‌లో జరిగే 35వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటలకు ఎంపిక చేశారు. కరీంనగర్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు చెన్నాడి అమిత్ కుమార్ హాజరై రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిక కాని క్రీడాకారులు నిరుత్సాహ పడకుండా భవిష్యత్‌లో పోటీలకు సిద్ధం కావాలని సూచించారు. జిల్లా బాలబాలికల జట్లు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో చోటు సంపాదించాలని ఆకాంక్షించారు. జిల్లా జట్లకు కోచ్, మేనేజర్లుగా వ్యవహరిస్తున్న పద్మ, ప్రశాంత్, పవన్, కృపాకర్, శివాజీని అభినందించారు. క్రీడాకారులకు క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ జనరల్ సెక్రెటరీ మల్లేష్‌గౌడ్, రాష్ట్ర కబడ్డీ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ సంపత్‌రావు, పెద్దపల్లి డీవైఎస్‌వో సురేష్, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు వీరన్న, హనుమంత్, సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములవాడలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



రాజన్న ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఎంతో విశిష్టమైన బతుకమ్మ పండుగను దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్న క్షేత్రంలో వైభవంగా ఏడు రోజులపాటు నిర్వహిస్తారు. రాజన్న ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన విద్యుత్ దీపాల వెలుగుల్లో మహిళలు బతుకమ్మలను ఆడిపాడారు. ఐదో రోజు అట్ల బతుకమ్మ వేడుకలను మహిళలు, యువతుల ఘనంగా నిర్వహించారు. జోరువాన కురుస్తున్నా మహిళలు, యువతులు వర్షంలోని ఆలయానికి తరలివచ్చి బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. రాజన్నఆలయ ధర్మగుండంలో బతుకమ్మలను నిమజ్జనంచేసి వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు. రాజన్న ఆలయంలో దేవినవరాత్రోత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారి వద్ద కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

శాస్త్రీయ విద్యావిధానం అమలుచేయాలి

● ఎస్ఎఫ్ఐ నిరసన



కోతిరాంపూర్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్నఎస్ఎఫ్ఐనాయకులు

భగత్‌నగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాస్త్రీయ విద్యా విదానం అమలు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ రజనీకాంత్, టి నాగరాజులు అన్నారు. గురువారం నగరంలోని కోతిరాంపూర్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో యుజిసి గైడ్‌లైన్స్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుజిసి విడుదల చేసిన ఆదిమ, అశాస్త్రీయ అభ్యాస ఫలితాల అధారిత పాఠ్యప్రణాళిక చట్టాన్ని (ఎల్ఓసిఎఫ్) రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పూజ, కిరణ్, శంకర్, మమత, గజ్జెల శ్రీకాంత్, ప్రశాంత్, అరవింద్, విగ్నేష్, భారత్, తారసింగ్, రాజు, లెనిన్, ఆది, రాజేష్, శ్రీజ, ప్రశాంత్, అభినవ్, అభి తదితరులుపాల్గొన్నారు.

ఆలయాల జీర్ణోద్ధరణకు మోక్షమెప్పుడో?

● నిత్యం రద్దీతో దేవాలయాలు
● అసౌకర్యాలతో భక్తుల ఇబ్బందులు



దూలూరులో శిథిలావస్థకు చేరిన శివాలయం

కథలాపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వందలాది సంవత్సరాల కిందట నిర్మితమైన ఆలయాలు జీర్ణోద్ధరణకు నోచుకోలేకపోతున్నాయి. ప్రతీదినం భక్తుల తాకిడితో సందడిగా ఉండే ఆలయాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ఉండడంతో అసౌకర్యంగా ఉంటోందని పలువురు పేర్కొంటున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా శిథిలావస్థలో ఉన్న ఆలయాలను మరమ్మతులు చేయించడంలో విఫలమవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని దూలూరులో శివాలయం, కలికోటలో త్రికూటేశ్వరస్వామి, భూషణరావుపేటలో వేణుగోపాలస్వామి, అంబారిపేటలో రాజరాజేశ్వరస్వామి ఆలయాలు శాతవాహనుల కాలంలో నిర్మించబడ్డాయని స్థానికులు చెబుతున్నారు. రాతి కట్టడాలతో పూర్తిగా వాస్తుదోష నివారణతో, ఎంతో ఆకర్షణీయంగా నిర్మించారు. పురాతన ఆలయాలు కావడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తుంటారు. ప్రతీ ఏటా శివరాత్రి సందర్భంగా జాతరలు నిర్వహిస్తుంటారు. అయితే ఆలయాల వద్ద సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. పూజారులకు కనీస వేతనం కూడా అందడం లేదు. ఏళ్ల తరబడి స్వామివారికి పూజలు చేస్తూనే కాలం గడపాల్సి వస్తోందని, దూప, దీప నైవేద్యాలకు కూడా నోచుకోవడంలేదని వాపోతున్నారు. జాతర సందర్భాల్లో గ్రామస్థులంతా కలిసి విరాళాలు పోగుచేసుకుని కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఆరు నెలల కిందట సిరికొండలోని పురాతన ఆలయ నిర్మాణం కోసం దేవాదాయ శాఖ 50 లక్షల రూపాయలు కేటాయించింది. మిగిలిన ఆలయాలకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల భక్తులు కోరుతున్నారు.

అరవై ఏళ్లుగా పూజలు చేస్తున్నా..

- పులికాంత శాంతయ్య, పూజారి, దూలూరు



వందల ఏళ్ల కిందట గ్రామ నడిబొడ్డున నిర్మించిన శివాలయంలో అరవై ఏళ్లుగా స్వామివారికి పూజలు చేస్తున్నా. ప్రతీదినం స్వామి సన్నిధిలోనే ఉంటూ పూజాదికాలు నిర్వహిస్తున్నాను. దూప, దీప నైవేద్యాల కింద ఈ ఆలయాన్ని గుర్తించలేదు. ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. నూతన ఆలయాన్ని నిర్మించడానికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తే కొత్త కళ వస్తుంది.



కలికోటలో త్రికూటేశ్వర స్వామి ఆలయం

రేపు రేవా రౌండ్ టేబుల్ సమావేశం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) ఉమ్మడి కరీంనగర్ జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు రేవా కన్వీనర్ కోహెడ చంద్రమౌళి తెలిపారు. స్థానిక కరీంనగర్ ఫిలింభవన్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు జరుగుతుందని పేర్కొన్నారు. 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు అందలేదని, సంవత్సర న్నర కాలంగా పెన్షన్ తప్ప ఏవీ అందక పోవడంతో మానసిక క్షోభకు గురి అవుతున్నామని చెప్పారు. సమావేశాన్ని ఉమ్మడి జిల్లాలోని రిటైర్డు ఉద్యోగులు విజయవంతం చేయాలని కోరారు.

పోస్టల్ ఉద్యోగులకు దసరా బోనస్ ప్రకటించాలి

హుజూరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ ఉద్యోగులకు దసరా బోనస్ ప్రకటించాలని ఏఐపీఈయూ గ్రూప్-సీ రాష్ట్ర అధ్యక్షుడు ఊకంటి మహేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఎంతో ఘనంగా జరుపుకునే దసరా పండుగకు రైల్వే ఉద్యోగులకు కేంద్రం ప్రకటించిన విధంగానే తపాలా ఉద్యోగులకు బోనస్ ప్రకటించాలని కోరారు. బకాయిలు చెల్లించాలన్నారు.

విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యను అందించాలి

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ● 'శాతవాహన'లో వసతి గృహాలకు శంకుస్థాపన

కరీంనగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విశ్వవిద్యాలయాలు నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శాతవాహన విశ్వ విద్యాలయం బాలికల హాస్టల్ ప్రాంగణంలో మహిళలు, పురుషుల (ఎస్టీ) వసతి గృహాలకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీ, గిరిజన బిడ్డల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో 20 కోట్ల విలువైన రెండు హాస్టల్ భవనాలను నిర్మించ డానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. దీంతో ఆదివాసీ, గిరిజన విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం సమకూరుతుందని తెలిపారు.

ప్రజాపాలనలో ఎన్నో మార్పులు

- మంత్రి పొన్నం ప్రభాకర్

బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజాపాలన నాయకత్వంలో ఎన్నో మంచి మార్పులు వచ్చాయన్నారు. జిల్లాలో విద్య, వైద్య సౌక ర్యాలు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ పెడు తున్నామన్నారు. యూజీసీ గ్రేడింగ్, న్యాక్, ఏఐసీటీఈ మార్గదర్శకాలను అనుసరించి నాణ్యమైన విద్యను అందించ డానికి అధ్యాపకులు కష్టపడాలన్నారు. భవిష్యత్తు తెలంగాణను అభివృద్ధి దిశలో తీసుకెళ్లి పిల్లల భవి ష్యత్తును తీర్చిదిద్దాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. విశ్వ విద్యాలయ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు చొరవ చూపిస్తోందన్నారు. పాలక వర్గ సహకారంతో నాణ్యమైన విద్యను అందించడానికి, విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాలలో ముందు నిలిపి లక్ష్యసాధనకు కృషి చేస్తామన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ నాణ్యమైన విద్యతోనే విద్యార్థులు మంచి ఉద్యోగాలు సంపాదించుకుంటారన్నారు. విశ్వ విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు సరిగ్గా ఉంటేనే నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, మున్సిపల్ కమి షనర్ ప్రఫుల్ దేశాయ్, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, ఓఎస్డీ టు వీసీ డాక్టర్ బి హరికాంత్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ రమాకాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుజాత, విశ్వవిద్యాలయ చీఫ్ వార్డెన్ డాక్టర్ మనోహర్ పాల్గొన్నారు.



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న మంత్రులు పొన్నం, అడ్లూరి తదితరులు

వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం



రాజన్న ఆలయంలో కూష్మాండ అవతారంలో



ధర్మపురిలో శాకాంబరీ రూపంలో



కొండగట్టులో కాత్యాయని అవతారంలో

వేములవాడలో కూష్మాండ రూపం..

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దేవీనవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రాజన్న ఆలయంలో అమ్మవారికి 11రోజులపాటు 11 అవతరాల్లో భక్తులకు దర్శనమివ్వనుంది. నాలుగో రోజు గురువారం రోజున అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు కూష్మాండ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ధర్మపురిలో శాకంబరి రూపంలో...

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి అనుబంధ రామలింగేశ్వర స్వామిఆలయంలో దేవినవరాత్రోత్సవాలు నాలుగోరోజు గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు కూష్మాండ శాకంబరి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జుక్కు రవీందర్, భక్తులు పాల్గొన్నారు

కొండగట్టులో కాత్యాయనిగా ..

మల్యాల : కొండగట్టు అంజన్న సన్నిధిలో జరుగుతున్న దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నాలుగవరోజు గురువారం అమ్మవారు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రాజెక్టుల నుంచి భారీగా నీటి విడుదల



ఎల్లంపల్లి నుంచి విడుదల అవుతున్న నీరు

● శ్రీరాంసాగర్ నుంచి మూడు లక్షల క్యూసెక్కులు దిగువకు..

జగిత్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం గురువారం కొనసాగింది. 39 గేట్లు పైకి ఎత్తి మూడు లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,05,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 60.706 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● ఎల్లంపల్లికి భారీగా వరద..

అంతర్గాం : మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో, కడెం ప్రాజెక్టు నుంచి 4,144 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి 3.41లక్షల క్యూసెక్కులు, వాగులు, వంకల నుంచి 2.68లక్షల కూసెక్కులు మొత్తం 6.14లక్షల క్యూసెక్కుల వరద నీరు పోటెత్తుతుంది. ఎగువ నుంచి ఇంకా వరద నీరు వచ్చే అవకాశం ఉన్నందున గురువారం ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు 40గేట్లు ఎత్తి 6.35లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన గల గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 20టీఎంసీలకు గాను ప్రస్తుతం 15.75టీఎంసీల నీరు నిల్వఉంది. ప్రాజెక్ట్‌వద్ద ఈఈ రవీంద్రచారి అధ్వర్యంలో అధికారులు ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉంటూ వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రాజెక్ట్ మీద నుంచి అంతర్గాం, మంచిర్యాలకు రాకపోకలను ప్రాజెక్ట్ అధికారులు నిలిపివేశారు.

● మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి : శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు గురువారం 5000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దిగువకు 3గేట్ల ద్వారా 6000 క్యూసెక్కులు, ప్యాకేజీ 9 లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కులు నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.87 ఉండగా, సామర్థ్యం 27,55 టీఎంసీలకు 27.222 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

● ఎల్ఎండీలోకి వరద నీరు..

తిమ్మాపూర్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా దిగువ మానేరు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం సాయంత్రం 6గంటల సమయం వరకు ఎల్ఎండి స్పిల్ వే ఆరు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు ఎల్ఎండిలోకి ఇన్‌ఫ్లోలు పెరుగుతుండటంతో 6గంటలకు మరో 2గేట్లు ఎత్తి మొత్తం 8 స్పిల్‌వే గేట్ల నుంచి 12వేల క్యూసెక్కుల నుంచి 20వేల క్యూసెక్కుల పెంచి దిగువకు నీటిని విడుదల చేశారు. మొత్తం 18,550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోలు ఎల్ఎండిలోకి వస్తుండగా 20వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



కేంద్ర హోం శాఖసహాయ మంత్రికి వినతిపత్రం అందిస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

భగత్‌నగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారినికి కృషి చేస్తానని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం రేషన్‌డీలర్ల సంఘం నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రికి కమిషన్ ఇప్పించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదన్నారు. కమిషన్ డబ్బులు ఇవ్వకుండా పండుగ పూట రేషన్‌డీలర్లను ఎందుకు గోసపెడుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదనలు పంపక పోయినా కేంద్ర ప్రభుత్వం అడ్వాన్సుగా 2025-26 సంవత్సరానికి మ్యాచింగ్‌గ్రాంటు కింద రూ.11.70కోట్లు అందించిందన్నారు. ఈనెల17న జరిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వమ్యాచింగ్ గ్రాంటు విషయం చర్చకు వచ్చిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మ్యాచింగ్ గ్రాంట్ అందించి రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించి, కమిషన్ డబ్బులు ఇవ్వాలని కోరారు.

అధ్వానంగా వ్యవసాయ మార్కెట్ రోడ్డు

● గుంతలు పడి... ప్రమాదకరంగా మారి..
● పట్టించుకోని అధికారులు
● వాహనదారుల ఇబ్బందులు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ రోడ్డు అధ్వానంగా మారింది. వర్షాలకు గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలతో పాటు, ఆటోలు, ట్రాలీలు నిత్యం వ్యవసాయ మార్కెట్‌కు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ గుంతల రోడ్డుపై ప్రయాణం చేస్తుండడంతో అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ మార్కెట్‌లో కరీంనగర్ వ్యవసాయ సహకారం సంఘంతో పాటు, మండల వ్యవసాయ కార్యాలయం ఉన్నాయి. ఇందులోనే రైతులకు ఎరువులను పంపిణీ చేస్తారు. మార్కెట్‌లో ప్రస్తుతం పండ్ల వ్యాపారం నిత్యం కొనసాగుతోంది. లారీలతోపాటు, ఆటోల్లో పండ్లను కొనుగోలు చేసి తీసుకెళ్తారు. ఇదే రహదారిలో నివాసాలు, పలు దుకాణాలు కూడా ఉన్నాయి. ఈ విషయంపై అధికారులు దృష్టిసారించాలని, వెంటనే మరమ్మతు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లే రోడ్డు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు, నిలిచిన నీరు

ప్రమాదకరంగా కరీంనగర్-జగిత్యాల రోడ్డు

● గుంతలతో ప్రయాణికుల ఇక్కట్లు ● పట్టించుకోని అధికారులు

కొడిమ్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూరు వద్ద కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారి గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు ఈ రోడుపై రాకపోకలు సాగిస్తాయి. మూల మలుపు వద్ద గుంతలు పడటంతో రాత్రి వేళల్లో వాహనాలు నడపటం కష్టంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి సమయంలో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు రోడ్డు దిగటంతో అదుపుతప్పి కిందపడడంతో గాయాలపాలైనట్లు పూడూర్ గ్రామస్థులు తెలిపారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



కొడిమ్యాల మండలం పూడూరు వద్ద గుంతలు పడ్డ రోడ్డు

అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లకు నేడు చివరి తేదీ

గణేష్‌నగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు శుక్రవారం 26 చివరి తేదీ అని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి ఇంటర్మీడియెట్ ఓపెన్ స్కూల్, ఐటీఐ, డిప్లమా విద్యార్థులు టీఎస్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇతర వివరాలకు 7382929755 నంబరులో సంప్రదించాలని సూచించారు.

శివలింగాన్ని హత్తుకున్న వానరం



శివలింగం వద్ద వానరం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన శ్రీభీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఒక అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. భీమేశ్వర ఆలయ వందుభాగంలో ఉత్తర ముఖంగా వున్న శివలింగంను ఓ వానరం హత్తుకుని కనిపించింది. శివలింగం ముందు ప్రణమిల్లినట్లు కొద్ది సేపటి వరకు శివలింగం వద్దనే ఉన్న దృశ్యం స్థానిక భక్తులను ఆశ్చర్యానికి గురిచేసింది.

ఇక మద్యం దుకాణాల జాతర

(5వ పేజీ తరువాయి)

కోటి 10 లక్షల లైసెన్స్ ఫీజుగా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. వైన్ షాపులకు సింగిల్ దరఖాస్తు వచ్చిన సందర్భంలో ఆ మద్యం షాపులను ముందుగానే ఖరారు చేసి ప్రకటిస్తారు. ఒకటికి మించి దరఖాస్తులు వచ్చిన సందర్భంలో లాటరీ ద్వారా లైసెన్స్‌దారులను ఖరారు చేయనున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో గతంలో మాదిరిగానే 3 లక్షల రూపాయల డీడీ లేదా చాలన్ జతచేసి దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

● ఉమ్మడి జిల్లా పరిధిలో మూడు స్లాబ్‌లు

ఉమ్మడి జిల్లా పరిధిలో మద్యం షాపులు మూడు స్లాబ్‌ల పరిధిలోకి రానున్నాయి. గ్రామీణ ప్రాంతాలు, నగర పంచాయతీల పరిధిలోని వైన్‌షాపులకు 50 లక్షలు, 55 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 65 లక్షల రూపాయల ఎక్సైజ్ టాక్స్ వర్తిస్తుంది. ఈ ఎక్సైజ్ టాక్స్‌లోనే పర్మిట్‌రూంల ఫీజులు కూడా కలిసి ఉన్నాయి. మద్యం అమ్మకాలు లైసెన్సు ఫీజుల్లో 10 రెట్ల వరకు మార్జిన్ విధానాన్ని అమలు చేయనున్నారు. మద్యం అమ్మకాలు లైసెన్సు ఫీజు కంటే 10 రెట్లకు మించి జరిగితే లైసెన్సీల మార్జిన్ 4 శాతానికి తగ్గించారు. మద్యం వ్యాపారులకు ఆర్డినరీ మద్యం అమ్మకాలపై 27 శాతం, మీడియం రకం అమ్మకాలపై 20 శాతం, బీర్‌పై 20 శాతం మార్జిన్‌ను ప్రభుత్వం ప్రకటించింది.

● వైన్‌షాపుల వేళలు

వైన్ షాపులు తెరచి ఉంచే సమయాలను ప్రభుత్వం ప్రకటించింది. జీహెచ్ఎంసీ పరిధిలో ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు, ఇతర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మకాలకు అనుమతి ఇస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఎల్ఐసీ బ్రాంచ్-2 అధ్యక్షుడిగా గట్టయ్య


గట్టయ్య


రాజనర్సింగరావు

భగత్‌నగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జీవిత బీమా సంస్థ కరీంనగర్- 21 బ్రాంచ్-2 యూనిట్ యూనియన్ అధ్యక్షుడిగా కె.గట్టయ్య ఎన్నికయ్యారు. గురువారం కరీంనగర్ బ్రాంచ్-2జీవిత బీమా సంస్థ ఉద్యోగుల 32వ వార్షిక జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజన్ యూనియన్ లీడర్స్ ప్రెసిడెంట్ ఎ. రామ్మోహన్‌రావు, జనరల్ సెక్రెటరీ వామన్‌రావు నూతన కమిటీని ప్రకటించారు. యూనియన్ అధ్యక్షుడిగా కె.గట్టయ్య, ప్రధాన కార్యదర్శిగా కె.రాజనర్సింగరావు, ఉపాధ్యక్షులు, సెక్రెటరీలు, కోశాధికారి, ఈసీ మెంబర్లు, ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు.

మందుల నిర్వహణలో ఫార్మసిస్టులదే కీలక పాత్ర

సుభాష్‌నగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రోగి సంరక్షణ మందుల నిర్వహణలో ఫార్మసిస్టుల కీలకపాత్ర పోషిస్తారని ఉమ్మడి జిల్లా ఆయుష్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిరిపురం రాజేశ్వర్ అన్నారు. గురువారం జిల్లా జనరల్ ఆసుపత్రిలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగి భద్రతలో ఫార్మసిస్టులు ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆయుష్, అలోపతి, యునాని, ఆయుర్వేద ఫార్మసిస్టులు తాటిపెల్లి విజేందర్, మునీర్, లక్ష్మి, శేషు, ప్రసాద్, యోగా ట్రైనర్స్ రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ జయంతి వేడుకలను బహిష్కరిస్తాం

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న వీరనారి చిట్యాల ఐలమ్మ 130వ జయంతి వేడుకలను బహిష్కరిస్తున్నట్లు తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐలమ్మ జయంతికి 33 జిల్లాలకు 12 లక్షల రూపాయలను కేటాయించారని, జిల్లాకు 10వేలు ఇచ్చారని, మిగిలిన రూ.26వేలు ఏమి చేశారో తెలుపాలని డిమాండ్ చేశారు. ఆమె వర్ధంతికి కూడా 33 జిల్లాలకు కేవలం మూడు లక్షల కేటాయించడం రాష్ట్ర రజకులను అవమానించడమేనని పేర్కొన్నారు.

ఘనంగా కుమారి పూజలు

చొప్పదండి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాతా యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద గురువారం కుమారి పూజలు నిర్వహించారు. కాత్యాయని దేవి అవతారంలో దుర్గాదేవి భక్తులకు దర్శనం ఇవ్వగా, అమ్మవారి విగ్రహానికి గాజులను అలంకరించారు. అర్చకులు సింహాచలం ప్రభాకరాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి సమక్షంలో బాలికలకు కుమారి పూజలు చేశారు.

చొప్పదండికి యూరియా కోటా పెంచండి

చొప్పదండి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): చొప్పదండికి అదనపు యూరియా కోటాను పెంచాలని చొప్పదండి ప్యాక్స్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి క్రిబ్కో చైర్మన్‌ను కోరారు. ఈ మేరకు న్యూఢిల్లీలో జరిగిన క్రిబ్‌కో సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై క్రిబ్‌కో నూతన చైర్మన్ వల్లభనేని సుధాకర్‌ను అభినందించి వినతిపత్రాన్ని అందజేశారు.

హాస్య నటుడు వేణుమాధవ్‌కు నివాళి

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శాయంపేట గ్రామంలో సినీ హాస్య నటుడు కూన్నత్ వేణుమాదవ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుమాదవ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. హాస్య నటుడిగా ఎంతో మందిని మెప్పించిన వేణుమాధవ్ గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎరబెల్లి రాజేశ్వర్‌రావు, మార్కెట్ డైరెక్టర్ కందాల తిరుపతి, ఆడ్తీదారులు శ్రీనివాస్, కొడారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురి అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకులోని కోయంబత్తూర్‌కు చెందిన వ్యక్తి నుంచి కోటి 60 లక్షల రూపాయలు కాజేసిన సైబర్ కేసులో చెన్నై సైబర్ క్రైం పోలీసులు కరీంనగర్‌కు చెందిన నలుగురిని గురువారం అరెస్టు చేశారు. నరేష్, కుమార్, అన్వర్, నరేష్‌ను కరీంనగర్ కోర్టులో హాజరు పరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై చెన్నైకి తీసుకుపోయేందుకు కోర్టు అనుమతి కోరగా నిరాకరించింది. ఈ నెల 27న చెన్నై సైబర్ క్రైం పోలీసుల ఎదుట హాజరుకావాలని ఆదేశించిందని పోలీసులు తెలిపారు.

ఎడతెరిపి లేని వర్షం.. పంటలకు నష్టం



వల్భాపూర్‌లో నెలకొరిగిన వరి, నర్సింగాపూర్‌లో తడిసిన పత్తి

వీణవంక, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షంతో పత్తి పంటకు తీవ్ర నష్టం జరుగుతోంది. చేనులో నీరు చేరడంతో పంట దెబ్బతింటోంది. వర్షంతో చేతికి వచ్చిన పంటలు పూర్తిగా దెబ్బ తింటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. తడిసిన పత్తి పూర్తిగా నల్లబడుతుండడంతో మార్కెట్లో ధర పలకడం లేదని పేర్కొంటున్నారు. తడిసిన పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. వరి పంట గింజ సమయంలో వర్షాలు కురుస్తుండడంతో పంట నేలకొరుగుతోందని దీంతో పంటనష్టం జరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

సైదాపూర్: సైదాపూర్ మండల కేంద్రంలోని ఐలాపురం శ్రీమతి పాత ఇల్లు వర్షానికి గోడలు నాని గురువారం కూలి పోయింది. కూలిన విషయం తెలుసుకున్న పంచాయతీ, రెవెన్యూ అధికారులు, నాయకులు పరిశీలించారు. ఇల్లు కూలడంతో ఉండడానికి ఇబ్బందిగా మారిందని తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని శ్రీమతి అధికారులను కోరుతోంది.

షహీదీ శతాబ్ది నగర కీర్తనలో మంత్రి పొన్నం


యాత్రలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరానికి బుధవారం రాత్రి చేరుకున్న 350వ షహీదీ శతాబ్ది నగర కీర్తన యాత్రలో భాగంగా గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు గురుద్వారాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిక్కు సమాజ 9వ గురువు గురు తేజ్‌బహదూర్‌జీ గౌరవించడం మన ధర్మమన్నారు. సీసీ గౌస్ ఆలం, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ ప్రార్థనలు చేశారు.

12న ట్రినిటి మెగా స్కాలర్‌షిప్ టెస్ట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు25 (ఆంధ్రజ్యోతి):పదోతరగతి విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ట్రినిటి జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో వచ్చే నెల 12న కరీంనగర్‌లోని పదో తరగతి విద్యార్థులకు టీస్పార్క్ పేరుతో ట్రినిటి మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు కళాశాలల ఫౌండర్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ట్రినిటి జూనియర్ కళాశాలలో స్కాలర్‌షిప్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇంటర్‌తో పాటు జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్, నీట్ కోచింగ్‌లో రూ.49,99,999 విలువైన స్కాలర్‌షిప్‌ను అంద జేయనున్నట్లు తెలిపారు. 12న ఉదయం 9.30 నుంచి 11 వరకు మొదటి బ్యాచ్, 11 నుంచి 12.30 వరకు రెండో బ్యాచ్ పరీక్షలు ఉంటాయన్నారు. అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, పాఠశాల యాజమన్యాలు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు.

విద్యాసంస్థల్లో బతుకమ్మ వేడుకలు


శ్రీచైతన్యలో బతుకమ్మలను పరిశీలిస్తున్న చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి



వాగేశ్వరిలో విద్యా సంస్థల కోశాధికారి గంద్ర శోభారాణి

తిమ్మాపూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలో బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బతుకమ్మలను భాజాభజంత్రీలతో విద్యార్థినులు కళాశాల ఆవరణలోకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమానికి శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మలను పూజించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మన సంస్కృతి సంప్రదాయాల విశిష్టతలను తెలియజేసే విధంగా కళాశాలలో సంబరాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థినిలు బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్లు, రామ నర్సింహరెడ్డి, ఏవో రామారావు, పీడీ సునీత, వైస్ ప్రిన్సిపాల్ శశికాంత్, మీడియా ఇన్‌చార్జి గొంటి రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాగేశ్వరి విద్యా సంస్థల్లో..

స్థానిక వాగేశ్వరి విద్యా సంస్థలలో గురువారం బతుకమ్మ సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ సంబరాలను వాగేశ్వరి విద్యా సంస్థల జనరల్ సెక్రటరీ గంద్ర శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. విద్యార్థినిలు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి కళాశాల ప్రాంగణంలో ఆటలాడారు. ఈ కార్యక్రమానికి విద్యా సంస్థల కోశాధికారి గంద్ర శోభారాణి ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడారు. విద్యార్థులు తయారు చేసిన బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. కళాశాల జాయింట్ సెక్రటరీ డి.శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, విభాగాధిపతులు పాల్గొన్నారు.

కిట్స్‌లో ..

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ కందుకూరి శంకర్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పే పండుగ బతుకమ్మ అని తెలిపారు. అనంతరం మహిళ అధ్యాపకులు బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మ పండుగను జరుపుకున్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగుల...

గణేష్‌నగర్: ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ సమావేశ మందిరంలో విద్యుత్ ఉద్యోగులు గురువారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. వేడుకలను విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్‌బాబు ప్రారంభించారు. ఉపేందర్, జంపాల రాజ్యం, తిరుపతి, చంద్రమౌళి, లక్ష్మారెడ్డి, ఎస్ఏఓ రాజేంద్రప్రసాద్, ఏవో అరవింద్, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో

సుభాష్‌నగర్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో గురువారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ బతుకమ్మ పండగ తెలంగాణకు ఎంతో ప్రత్యేకమైందన్నారు. ఈ పండగ ప్రకృతితో ముడిపడిన పండగన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ సాజిదా, డాక్టర్ సనజవేరియా, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ రాజగోపాల్, డాక్టర్ చందు, ఎన్‌హెచ్ఎం డీపీవో స్వామి, శ్రీనివాసులు, స్వాతి, కైక, సరస్వతితోపాటు పట్టణ ఆరోగ్య కేంద్రం మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

అన్నారంలో నిలిచిన నీటి సరఫరా


అన్నారంలో లీకైన తాగు నీటి పైపులైను

మానకొండూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలోని అన్నారంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్ కావడంతో మూడు రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు ట్యాంకుల ద్వారా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ పథకంలో నిర్మించిన వాటర్ ట్యాంకులోకి ఎల్ఎండి నుంచి సరఫరా అయ్యే ముఖ్యమైన పైప్‌లైన్ మూడు రోజుల క్రితం లీకైంది. పండుగ వేళ తాగునీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్థులు అనేక ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోక పోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. గ్రామపంచాయతీ సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టినా పైప్ ద్వారా నీటి సరఫరా అధికం కావడంతో పనులకు ఆటంకం కలుగుతోందని పంచాయతీ కార్యదర్శి అశ్విని తెలిపారు.

స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్వరాజ్ ట్రాక్టర్స్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు రైతులు కొనుగోలు చేసిన ట్రాక్టర్లను బండి సంజయ్‌కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణలతో ఒక్కో ట్రాక్టర్‌పై రూ. 40 వేల నుంచి 80 వేల వరకు ఆదా అవుతోందని రైతులు సంతోష పడుతున్నారన్నారు. దేశంలో కొనుగోలు చేయడం ద్వారా స్థానిక కంపెనీలు, చిన్న తరహా వ్యాపారాలు బలపడతాయన్నారు. స్థానిక ఆర్థికవ్యవస్థ బలపడడంతోపాటు, డబ్బు దేశంలోనే చలామణి అవుతుందన్నారు. స్వయం సమృద్ధి చెందిన దేశంగా (ఆత్మ నిర్భర భారత్) అభివృద్ధి చేసేందుకు ప్రధాని మోదీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతీ ఒక్కరు సంపూర్ణ మద్ధతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, స్వరాజ్ టాఆక్టర్ డీలర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్..

బతుకమ్మ ఏర్పాట్లను పూర్తి చేయాలి

గంగాధర, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆడపడుచుల పండగా బతుకమ్మకు ఏర్పాట్లను పూర్తి చేయాలని ఎంపీవో గౌరీ రమేష్ అన్నారు. గురు వారం ఆయన గంగాధర మండ లంలోని ఉప్పరమల్యాలలో బతుకమ్మ మైదానం నీటితో నిండగా ట్రాక్టర్‌తో తొలగించారు. రంగారావుపల్లిలో మైదానంలో పిచ్చిమొక్కలను తొలగించి చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామాల్లో కార్యదర్శులు బతుకమ్మ వేడుకలకు మైదానాలను సిద్ధం చేస్తూ, లైటింగ్ ఏర్పాట్లతోపాటు నిమజ్జన ప్రదేశంలో సౌకర్యాలు కల్పిం చాలన్నారు.

పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి

చొప్పదండి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్నకొండ గ్రామంలో బీజేపీ నాయకులు దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మొగిలి మహేష్, నాయకులు గొల్ల గట్టయ్య, సింగిరెడ్డి భూంరెడ్డి, మొగిలి సారయ్య, దామెర మధుసూదన్ రెడ్డి, దయ్యాల శేఖర్, తాళ్లపల్లి రవి, గంగారెడ్డి, వెంకట రమణ, సంతోష్, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

కొంపల్లి వెంకట్‌గౌడ్‌కు సంతాపం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రచయిత, తెలంగాణ వాది కొంపల్లి వెంకట్‌గౌడ్ మృతికి తెలంగాణ రచయితల సంఘం, సాహి తీ గౌతమి బాధ్యులు కొత్త అనిల్ కుమార్, దొమ్మటి శంకర్‌ప్రసాద్, గంగుల శ్రీకర్, కాందూరి వెంకటేశ్వర్లు, నీలగిరి అనిత, నంది శ్రీనివాస్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన సాహిత్య జీవితం, తెలంగాణ కోసం పడిన తపనను గుర్తుకు చేసుకున్నారు.

అన్నదానం

సుభాష్‌నగరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. బొక్కల మనీషా, సాయికిరణ్ కుమారుడు జయ్ స్కంద అన్నప్రాసన సందర్భంగా జిల్లా జనరల్ ఆసుపత్రిలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్ర మంలో క్లబ్ అధ్యక్షుడు బట్టు రాజేం దర్, కార్యదర్శి కాంరెడ్డి నర్సింహరెడ్డి, కోశాధికారి చిరంజీవ చారి, చింతల లావణ్య, కిషన్ పాల్గొన్నారు.

శ్రీనివాస్ నేత్రాలు సజీవం

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాను మరణించిన మరొకరికి చూపు ప్రసాదించడంతో పాటు తమ వారికి జ్ఞాపకాలు నిలిచి పోయేలా కంభంపాటి శ్రీనివాస్ కుటుం బీకులు తీసుకున్న నిర్ణయం పలువురికి ఆదర్శంగా నిలిచింది. జమ్మికుంట పట్టనానికి చెందిన శ్రీనివాస్ (52) గుండెపోటుతో మృత్యువాత పడ్డాడు. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు మచ్చగిరి నరహరి ఆధ్వర్యంలో వరం గల్ ఎల్‌విపి టెక్నీషన్ లక్ష్మణ్ సహ కారంతో ఆయన నేత్రాలను ఐ బ్యాం కుకు పంపించారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ నిర్వాహకులు అభినందన పత్రం అందజేశారు.

ఆలయ ప్రాంగణంలో అధికారుల శ్రమదానం

జమ్మికుంట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సి పల్ పరిధిలోని ఆబాది జమ్మి కుంటలో గల శివాలయం ఆవరణలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు గురువారం శ్రమదానం నిర్వహించారు. ఆలయం ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు, చెత్త, చెదారం తొలగించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహేష్, ఈఈ శ్రీకాంత్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కాత్యాయని అవతారంలో అమ్మవారు

ఇల్లందకుంట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలకేంద్రంలోని గ్రామ దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మానకొండూర్: శరన్నావరాత్రోత్సవాల్లో బాగంగా మండలంలోని వివిద గ్రామాలలోని దుర్గామాతా మండపాల్లో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి తీర్థప్రసాదాన్ని స్వీకరించారు.

● ఆడారు... అక్కడే వదిలేశారు



నగరంలోని పూలే మైదానంలో బుధవారం జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. నిమజ్జనం చేయాల్సిన బతుకమ్మలను అనంతరం అక్కడే ఇలా నిర్లక్ష్యంగా వది లేశారు. - ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

పోటాపోటీగా క్షీరాభిషేకాలు


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

హుజూరాబాద్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తమ నాయకుడి వలనే నిధులు వచ్చాయంటూ పోటా పోటీగా గురువారం క్షీరాభిషేకాలు చేశారు. ఈ నిధులు తమ నాయకుడి కృషితోనే వచ్చాయని రెండు పార్టీల నాయకులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతోపాటు రోడ్లపైకి వచ్చి సంబరాలు నిర్వహించారు. హుజూరాబాద్, జమ్మికుంట మున్సి పాలిటీల అభివృద్ధికి రూ.30కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విషయం తెలుసు కున్న కాంగ్రెస్ శ్రేణులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వొడితెల ప్రణవ్, సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, మం త్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు కృషితోనే నిధులు వచ్చాయన్నారు. మరో వైపు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడడంతోనే నిధులు మంజూరయ్యాని ఆయన చిత్ర పటానికి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు.

జమ్మికుంట : హుజూ రాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15కోట్ల చొప్పున రూ.30కోట్లు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జ్ వొడి తల ప్రణవ్‌బాబు కృషితో నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. నాయకులు దేశిని కోటి, సుంకరి రమేష్, పరుశరామరావు, సాయిని రవి, సతీష్‌రెడ్డి, శ్రీపతి నరేష్ పాల్గొన్నారు.

● టీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

హుజూరాబాద్, జమ్మికుంట మున్సి పాల్టీల అభివృద్ధికి ప్రభుత్వంతో పోరాటం చేసి రూ.30కోట్ల నిధులు తీసుకువచ్చారని సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. టీఆరెస్ నాయకులు రవీందర్‌రావు, శ్రీనివాస్, సంపత్, వెంకటేష్, సందీప్, రమేష్, మొగిలి, రాజేష్, సలీం పాల్గొన్నారు.


క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పేదలు, కార్మికులను ఆదుకోవాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా రోజువారి కూలీలు, పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ కోరారు. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా రోజువారి కూలీలకు పనిలేకుండా పోయిందన్నారు. పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులు, పేదలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులతో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడి


బురదమయమైన దేవంపల్లి-గంగిపల్లి రోడ్డు

మానకొండూర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవంపల్లి-గంగిపల్లి రోడ్డు చినుకుపడితే చిత్తడి అవుతోంది. వర్షాకాలంలో రోడ్డంతా బురదమయమై నడవడానికి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పొలాల్లోకి వెల్లడానికి అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.